సాక్షి వనపర్తి

బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



ఒకేచోట తిష్ట!

మహబూబ్‌నగర్‌లో కొందరు అధికారులు కలెక్టరేట్‌ను వీడకుండా ఏళ్లుగా తిష్టవేశారు.

వివరాలు 8లో ▸



..ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని లక్షద్వీప్ పీసీసీ అధ్యక్షుడు అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /23.8

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు నుంచి భారీవర్షం కురిసే అవకాశం ఉంది.

నిబంధనలకు నీళ్లు..!

వాస్తు మరమ్మతులంటూ రూ.50 లక్షల వ్యయం



వనపర్తి మున్సిపల్ కార్యాలయం



- కౌన్సిల్ తీర్మానం లేకుండా వెచ్చింపు
- ముక్తకంఠంతో వ్యతిరేకించిన స్వపక్ష, విపక్ష కౌన్సిలర్లు
- ఎజెండా నుంచి పక్కన పెట్టిన వైనం
- స్పందించని ఉన్నతాధికారుల తీరుపై అసంతృప్తి
- పంచాయతీలకు ఓ న్యాయం.. పురపాలికలకు ఒక న్యాయమా?

వనపర్తి: నిబంధనలు, అధికారాలను అతిక్రమించి అత్యవసర పనుల పేరిట కౌన్సిల్ తీర్మానం లేకుండా వాస్తు దోష నివారణకు ఏకంగా రూ.50 లక్షల ప్రజాధనం వెచ్చించిన తీరు జిల్లావ్యాప్తంగా దుమారం లేపుతోంది. నాలుగు దశాబ్దాల వనపర్తి మున్సిపాలిటీ చరిత్రలో ఎమర్జెన్సీ పనుల కేటగిరీలో ఇంత పెద్దమొత్తం ఖర్చుచేసి ప్రస్తుత పాలకవర్గం చరిత్రకెక్కింది. ఐదు నెలల సుదీర్ఘకాలం తర్వాత మంగళవారం నిర్వహించిన మున్సిపల్ సమావేశంలో నిధుల వినియోగం, అభివృద్ధి పేరిట అక్రమాలకు పాల్పడ్డారంటూ.. స్వపక్ష, విపక్ష కౌన్సిలర్ల వాదనలు మిన్నంటాయి. అన్ని సౌకర్యాలతో నిర్మించిన పుర కార్యాలయ భవనం కొంత కాలం జిల్లా పోలీసు కార్యాలయంగా కొనసాగినంతలోనే వాస్తుదోషాలు వస్తాయా? ఒకవేళ మరమ్మతులు చేయాలన్నా కౌన్సిల్‌లో చర్చించి నిధులు కేటాయించి టెండర్లు పిలిచి పనులు చేయించాలన్న నిబంధనలు అధికార, పాలకవర్గం మరిచిపోవటం శోచనీయమనే చెప్పాలి. ప్రహరీ నిర్మాణం, గేటు, సీలింగ్ పనులు, మున్సిపాలిటీ పేరు రాయించటం, బోరుబావి తవ్వించటంలాంటి పనులను ఎమర్జెన్సీ పనులుగా చూపించటం చోద్యమంటూ స్వయంగా మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ఘాటు విమర్శలు చేయటం ఒకేపార్టీకి చెందిన కౌన్సిలర్లలో భేదాభిప్రాయాలు ఉన్నాయనే విషయాన్ని స్పష్టం చేయటంతో పాటు మున్సిపాలిటీలో పాలన ఏకపక్ష నిర్ణయాలతో సాగుతున్నట్లు తెలుస్తోంది.

తీర్మానానికి ససేమిరా అన్న కౌన్సిలర్లు..

వాస్తుదోష నివారణకు రూ.50 లక్షలు వెచ్చించాం. చైర్మన్ ముందస్తు అనుమతితో చేసిన పనులంటూ ఎజెండా అంశాల్లో చేరిన ఈ పద్దుకు తీర్మానం చేసేది లేదంటూ వ్యతిరేకించిన వైస్ చైర్మన్‌కు మిగతా కౌన్సిలర్లు ముక్తకంఠంతో మద్దతు తెలియజేయటంతో అంశాన్ని పక్కనబెట్టడం అధికార పక్షానికి తలవంపులు తీసుకొచ్చిందనే చెప్పవచ్చు.

అవినీతిపై విచారణ జరపాలి..



వనపర్తి మున్సిపాలిటీలో నాలుగేళ్లలో చోటుచేసుకున్న అవినీతిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలి. ఇందుకు పుర ప్రజలు, తాము పూర్తిగా సహకారం అందిస్తాం. పుర సమావేశాల్లో ప్రజా సమస్యల కంటే నిధుల వినియోగంపైనే ఎక్కువ సమయం వెచ్చించి కాలయాపన చేస్తున్నారు. ఇన్‌చార్జ్ పాలకులను అడ్డం పెట్టుకొని పాలకులు అవినీతికి పాల్పడుతున్నారు.

– సతీష్‌యాదవ్, అధ్యక్షుడు, అఖిలపక్ష ఐక్యవేదిక, వనపర్తి

పూర్తిస్థాయిలో విచారణ..



వనపర్తి మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా చేసిన నిధుల వినియోగంపై పూర్తి వివరాలు సేకరిస్తాం. సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలకు సిఫారస్ చేస్తాం. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పాలనపై దృష్టి సారిస్తాం.

– ఎస్.తిరుపతిరావు, ఇన్‌చార్జి స్థానికసంస్థల అదనపు కలెక్టర్

స్పందించని ఉన్నతాధికారులు..

స్థానిక సంస్థల నిధుల వినియోగంలో ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకుని క్షుణ్ణంగా పరిశీలించే ఉన్నతాధికారులు వనపర్తి మున్సిపాలిటీ విషయంలో ఎందుకు కలుగజేసుకోవటం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. పంచాయతీ పాలనలో ఒకలా.. మున్సిపల్ పాలనలో నిధుల వినియోగంపై మరోలా ఎందుకు స్పందిస్తున్నారనే చర్చ ప్రజలు, ప్రజాప్రతినిధుల్లో వినిపిస్తోంది. నిధుల వినియోగంలో లోపాలను ప్రస్తావిస్తూ.. ఇటీవల జిల్లాలో ఇద్దరు సర్పంచులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మున్సిపాలిటీలోని జనరల్ ఫండ్ ప్రజాధనం కాదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నారు. ఈ విషయంపై స్పందించాలని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు కలెక్టర్‌కు బహిరంగలేఖ రాయటం చర్చనీయాంశంగా మారిందని చెప్పవచ్చు.

విమర్శలు కొత్తేమీ కాదు..

ప్రస్తుత పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తొలినాళ్ల నుంచి మున్సిపల్ సర్వసభ్య సమావేశాల్లో స్వపక్ష కౌన్సిల్ సభ్యులే చైర్మన్, కమిషనర్ ప్రవేశపెట్టిన ఎజెండా అంశాలు, ప్రతిపాదించిన, పూర్తిచేసిన పనుల విషయంలో వ్యతిరేకించే సంస్కృతి మొదలైంది. విపక్షాల కంటే స్వపక్ష సభ్యులే ఎక్కువగా నిధుల వినియోగం, మున్సిపాలిటీలో అవినీతి చోటు చేసుకుంటుందనే విమర్శలు గుప్పించటం పరిపాటిగా మారింది. ప్రతి సమావేశంలో స్వపక్షాల ఆరోపణలే ఎక్కువగా ఉండటం శోచనీయం.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

ఎస్పీ రక్షిత కె.మూర్తి



వీసీలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రక్షిత కె.మూర్తి

వనపర్తి: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ రక్షిత కె.మూర్తి తెలిపారు. మంగళవారం డీజీపీ అంజనీకుమార్ హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమీషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొని జిల్లా వివరాలు వెల్లడించారు. సమస్యాత్మక గ్రామాలను సందర్శించి సమస్యలు తెలుసుకుంటూ ప్రజలతో మమేకమవుతూ అధికారులు పనిచేసేలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. గత ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించిన వారిపై, జిల్లా పరిధిలోని రౌడీలు, కేడీలు, సస్పెక్ట్‌లపై పూర్తి నిఘా ఉంచామన్నారు. పెండింగ్ కేసులను కోర్టు అధికారుల సమన్వయంతో పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బందికి నిరంతరం శిక్షణ, వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. షీటీమ్స్, సైబర్ నేరాలు, చట్టాలు, ట్రాఫిక్ రూల్స్, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు తదితర వాటిపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆనందరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్, సైబర్ క్రైం సీఐ శ్రీను, డీసీఆర్‌బీ ఎస్ఐ సంతోష్, ఐటీకోర్ హెడ్ కానిస్టేబుల్ గోవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ ఆదేశం.. కేసీఆర్ ఆచరణ



వనపర్తిలో పర్యటిస్తున్న యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్, చిన్నారెడ్డి తదితరులు

- కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం
- యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్

వనపర్తిటౌన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వ ఆదేశాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆచరిస్తున్నారని యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్ అన్నారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ హామీలను సోమవారం వనపర్తితో పాటు మండలం, పెద్దమందడిలో ఇల్లిల్లూ తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోనియాగాంధీ ప్రకటించిన గ్యారెంటీ హామీలతో ప్రజల భవిష్యత్‌కు భరోసా, పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎంతో లాభం పొందుతాయని వివరించారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం, మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు తప్పా ప్రజలు బాగుపడలేదని ఆరోపించారు. మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేపట్టే సంక్షేమ ఫలాల మేనిఫెస్టోను విజయభేరి సభలో విడుదల చేసిన విషయం తెలిసిందేనని.. ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ రైతుభరోసా పథకంతో రైతులందరూ ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.10 వేల ఆర్థిక సాయం పొందుతారని చెప్పారు. నియోజకవర్గ నాయకుడు మేఘారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని, కాంగ్రెస్ అభ్యర్థికి ఓటువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో బైక్‌ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ నరసింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శిసత్యారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, నాయకులు రాధాకృష్ణ, రమేష్‌యాదవ్, రఘు, దామోదర్, ప్రసాద్, రమేష్‌గౌడ్, రాధాకృష్ణ, బ్రహ్మంచారి, వెంకటేష్, సత్యశీలారెడ్డి, రామచంద్రయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రంజిత్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

వనపర్తిటౌన్: రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలు గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి శ్రీధర్, ప్రధానకార్యదర్శి నరసింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని డా. బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో ఎంపికలు ఉంటాయని.. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పదోతరగతి మెమో, కుల, జనన ధ్రువీకరణ పత్రాల్లో ఏదైన ఒకటి తీసుకొని రావాలని, పూర్తి వివరాలకు సెల్‌ఫోన్ నంబర్లు 94413 53375, 80961 15222 సంప్రదించాలని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు కరీంనగర్‌లో ఈ నెల 30వ, అక్టోబర్ 1న రెండ్రోజుల పాటు కొనసాగుతాయన్నారు.

భూసేకరణ ప్రక్రియ పూర్తిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తిచేయడంతో పాటు చివరి ఆయకట్టుకు నీరందించేందుకు భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డివిజినల్ టాస్క్‌ఫోర్స్ బృందంతో సమావేశమై భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం, పునరావాసం తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలోని కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, రాజీవ్ భీమా ఎత్తిపోతల రిజర్వాయర్, డిస్ట్రిబ్యూటరీ కాల్వల సర్వే, భూసేకరణపై డివిజన్ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రిజర్వాయర్‌తో పాటు డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం పూర్తయితేనే రైతులకు సాగునీరు అందుతుందని.. సర్వేతో పాటు అవార్డులు పాస్‌చేసి భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని, ఏ రోజు ఎవరు ఎక్కడ సర్వే చేస్తారు.. ఏ పని పూర్తి చేస్తారన్న నివేదిక అందించాలన్నారు. భూ సేకరణ విభాగం స్పెషల్ కలెక్టర్‌తో పాటు రెవెన్యూ, ఇరిగేషన్ సంయుక్తంగా పనులు చేపట్టి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. బుద్ధారం, ఖిల్లా ఘనపురానికి సంబంధించిన డి–7, డి–8 కాల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇరిగేషన్ డీఈలు, సర్వేయర్లను ఆదేశించారు. వచ్చే వారం రోజుల్లో కనీసం ఒక ప్రాజెక్టు భూ సేకరణ పనులు పూర్తయ్యేలా చూసుకోవాలని కోరారు. రైతులు పెద్ద మనసుతో అర్థం చేసుకొని అధికారులకు సహకరించాలన్నారు. అనంతరం పునరావాస కేంద్రాల స్థితిగతులపై చర్చించి అర్హులందరికీ సాధ్యమైనంత త్వరగా ప్లాట్లు కేటాయించటంతో పాటు మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ) వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ పి.మధుసూధన్‌రావు, డీఈఈలు వెంకటరమణమ్మ, అబ్దుల్ గఫార్, నరేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

వడివడిగా ప్రక్రియ

- కొనసాగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు
- మొదటిదశలో 202 మంది హెచ్‌ఎంల బదిలీలు పూర్తి
- త్వరలోనే స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు
- స్పౌజ్ దుర్వినియోగపరుస్తూ హెచ్‌ఆర్‌ఏ ప్లేస్‌లకు బదిలీలు



ఆన్‌లైన్‌లో వివరాలు పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ తదితరులు (ఫైల్)



ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయుల వివరాలు పరిశీలిస్తున్న డీఈఓ, అధికారులు (ఫైల్)

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9,818 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 2న దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కాగా.. 15 వరకు ఆన్‌లైన్‌లో 202 మంది హెచ్‌ఎంలను మల్టీ జోన్ విధానంలో బదిలీ చేశారు. అలాగే షెడ్యూల్ ప్రకారం మంగళవారంతో స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ఉపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించాల్సి ఉంది. అయితే కోర్టు కేసుల కారణంగా ప్రక్రియ ఆలస్యం కానున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి రీషెడ్యూల్ రానుందని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. సీనియార్టీ జాబితాలో మొదటిదశలో తప్పులు దొర్లాయి. దీనిపై దాదాపు 2వేలకు పైగా అభ్యంతరాలు రాగా 70 శాతం వరకు అధికారులు పరిష్కరించారు. అయితే ఇప్పటికీ కొన్ని తప్పిదాలు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా స్పౌజ్ బదిలీల్లో పలువురు అక్రమాలకు పాల్పడుతున్నారని, నిబంధనలకు విరుద్ధంగా పలువురు హెచ్‌ఆర్‌ఏ ప్లేస్‌కు బదిలీ అవుతున్నట్లు సమాచారం.

సీనియార్టీ జాబితా ప్రకారం..

సాధారణ సీనియార్టీ జాబితాను ఇప్పటికే అధికారులు ప్రకటించారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్లకు ఎనిమిదేళ్లు, హెచ్‌ఎంలకు ఐదేళ్ల సర్వీస్ ఉంటేనే బదిలీకి అవకాశం కల్పించనున్నారు. కాగా ఖాళీగా ఉన్న హెచ్‌ఎం పోస్టులలో సీనియార్టీ ఉన్న వారికి మాత్రమే స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పిస్తారు. సబ్జెక్టుల వారీగా సీనియార్టీ జాబితా ప్రకారం 1:3 రేషియో ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఇప్పటికే పూర్తయింది. ఇందులో పదోన్నతులు ఇష్టం లేని వారు నాట్ విల్లింగ్ ఉంటే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. చివరగా రాష్ట్ర ఆర్జేడీ కార్యాలయం నుంచి పదోన్నతులకు సంబంధించి ఆర్డర్స్ అందితే వెంటనే విధుల్లో చేరాలి. అయితే ఇప్పటి వరకు కేవలం మహబూబ్‌నగర్ జిల్లాలో 85 మందికి స్థానచలనం కల్పించారు. ఇందులో జిల్లాకు ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చినవారు 44, ఇతర జిల్లాలకు పోయినవారు 31 మంది, కేవలం జిల్లాలోనే బదిలీ అయిన వారు 10 మంది ఉన్నారు. ఇలా మూడు కేటగిరీల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 202 మందిని బదిలీ చేశారు. హెచ్‌ఎంల బదిలీల అనంతరం ఉమ్మడి జిల్లాలో 237 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఎస్‌ఏలకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించి ఆయా పోస్టులు భర్తీ చేయనున్నారు.

జిల్లా	దరఖాస్తు చేసుకున్న టీచర్లు	బదిలీ అయిన హెచ్‌ఎంలు	ఖాళీగా ఉన్న హెచ్‌ఎం పోస్టులు
మహబూబ్‌నగర్	2,663	87	24
నాగర్‌కర్నూల్	2,478	35	72
వనపర్తి	1,639	31	51
జోగుళాంబ గద్వాల	1,569	28	44
నారాయణపేట	1,469	21	46



పాఠశాలలు బలోపేతం..



ప్రభుత్వం బదిలీలు, పదోన్నతులు చేపట్టడం గొప్పవిషయం. పదోన్నతుల ద్వారా జిల్లాలో పని చేస్తున్న హెచ్‌ఎంల సంఖ్య 101కి చేరింది. దీంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయి. త్వరలోనే స్కూల్ అసిస్టెంట్‌లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియ జరగనుంది.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్, నారాయణపేట

హెచ్‌ఆర్‌ఏ ప్రాంతాల్లోకి..

బదిలీల్లో ఎక్కువగా స్పౌజ్‌ను దుర్వినియోగం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. భార్య, భర్త ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, ఒక మండలం నుంచి మరో మండలానికి భార్య ఉన్న చోటుకు భర్త అయిన వెళ్లాలి.. లేదా భర్త ఉన్న చోటుకు భార్య అయిన రావాలి. కానీ, చాలామంది స్పౌజ్ పేరు మీద పాయింట్లు పొంది భార్యాభర్తలు ఒకే చోటుకు వెళ్లకుండా హెచ్‌ఆర్‌ఏ (హోం రెంట్ అలవెన్సు) ఉన్నచోటుకు బదిలీ అవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. హెచ్‌ఆర్‌ఏ ప్రాంతాల్లోకి వెళ్లడం వల్ల వచ్చే వేతనంలో రూ.5–7 వేల వరకు అదనంగా వేతనం రానుంది. దీనికోసం పలువురు అడ్డదారులు తొక్కుతున్నారని అధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. అలాగే గతంలో స్పౌజ్ వాడుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తుంది. ఇందుకు కొందరు ఎంఈఓలు మద్దతు ఇస్తున్నట్లు సమాచారం.

న్యూస్‌రీల్

మట్టి గణపతికి మంత్రి పూజలు



వనపర్తి: జిల్లాకేంద్రంలోని 30వ వార్డులో నిత్యా మహిళా యోగా కేంద్రంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడికి మంగళవారం రాత్రి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ధనధాన్యాలు, ప్రజలు విజ్ఞానంతో సుభిక్షంగా జీవించాలని స్వామివారిని కోరినట్లు మంత్రి తెలిపారు. అనంతరం మహిళలు ఏర్పాటు చేసిన అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఆయనవెంట జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుపరిపాలన



ఆత్మకూర్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందని.. రాష్ట్ర ప్రజలు ఇదే విషయాన్ని బలంగా నమ్ముతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వివిధ పార్టీలకు చెందిన 30 మంది యువకులు బీజేపీలో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అధికార పార్టీ మోసపూరిత హామీలతో ప్రజలు విసిగిపోయారని, కుటుంబ పాలనను అంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. రాబోయే రోజుల్లో మక్తల్ నియోజకవర్గంలో బీజేపీలోకి భారీగా చేరికలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రేచింతల శ్రీనివాస్, చిన్న నర్సింహ, మధు, బాలకృష్ణ, వెంకటేష్, రాజేష్, దీపక్, శశిధర్ రెడ్డి, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలి



పెబ్బేరు రూరల్: అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాల ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తూ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కేంద్రాలు మూసేసి హక్కుల సాధనకు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. వారికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ అనేక రకాలుగా అంగన్‌వాడీలను భయభ్రాంతులకు చేస్తోందని.. అయినా వారు ధైర్యంగా సమ్మె కొనసాగిస్తున్నారని వివరించారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ముట్టడి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు శారద, జిల్లా కార్యదర్శి నారాయణమ్మ, కవిత, రాధ, రమాదేవి, సునీత, సుమతి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.13 లక్షలు పలికిన లడ్డు



కొత్తకోట: పట్టణ సమీపంలోని బ్రహ్మంగారి ఆలయంలో విశ్వకర్మ జయంతి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన లడ్డూ వేలం మంగళవారం నిర్వహించారు. కొత్తకోటకు చెందిన మణికంఠ జ్యువెలర్స్ యజమాని నాగరాజుచారి రూ.1.13 లక్షలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజుచారిని సంఘం నాయకులు ఆనంద్‌చారి, వెంకటయ్యచారి, ప్రతాప్, లక్ష్మీపతి, శ్రీనివాసులుచారి, వెంకటేష్, విజయ్, కృష్ణయ్య అభినందించారు.

క్లుప్తంగా

బైక్‌పై నుంచి పడి యువకుడి దుర్మరణం


మల్లేష్ (ఫైల్)

పాన్‌గల్: బైక్‌పై నుంచి పడి యువకుడు దుర్మరణం చెందిన ఘటన మండలంలోని రేమద్దుల గ్రామశివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ వేణు వివరాల మేరకు.. గోపాల్‌పేట మండలం ఎదుట్లకు చెందిన బొద్దుల మల్లేష్ (28) సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వనపర్తి నుంచి సింగాయిపల్లికి వెళ్తూ రేమద్దుల శివారులో అదుపు తప్పి కింద పడ్డాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి..

ఎర్రవల్లిచౌరస్తా: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి (42) మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ అశోక్‌బాబు కథనం మేరకు.. బీచుపల్లి ఆయిల్ మిల్లు సమీపంలో హైదరాబాద్ వెళ్లే రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహంపై నుంచి వాహనాలు వెళ్లడంతో నుజ్జునుజ్జయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని గద్వాల మార్చురీకి తరలించారు. మృతుడు బ్లూ కలర్ పాయింట్, నల్లటి గీతలు కలిగిన చొక్కా ధరించాడని, ఆచూకీ తెలిసిన వారు ఇటిక్యాల పీఎస్ 8712670282 నంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి..

గోపాల్‌పేట: ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తాడిపర్తిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. తాడిపర్తికి చెందిన సుక్కా సురేష్ (29) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలోని చింతలయ్యకుంటకు బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం కుటుంబ సభ్యులు గాలించగా, చింతలయ్యకుంటలో శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ..

ఎర్రవల్లిచౌరస్తా: మండలంలోని సాతర్ల గ్రామానికి చెందిన కుర్వ లింగన్న (30) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. ఈనెల 10న కుటుంబ సభ్యులతో గొడవపడి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యుల అతడిని కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో పంచాయతీరాజ్ ఏఈ..


నరేందర్ (ఫైల్)

కల్వకుర్తి రూరల్/మన్ననూర్: కల్వకుర్తిలో పంచాయతీరాజ్ ఏఈగా పనిచేస్తున్న దాసరి నరేందర్(59) మంగళవారం మృతిచెందారు. అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావికి చెందిన ఈయన గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంచి వ్యక్తిని కోల్పోయామని గ్రామస్తులు, తోటి స్నేహితులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, పలువురు కమ్యూనిస్టు నాయకులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. నరేందర్‌కు భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆకలిబాధ తాళలేక..


నాగమ్మ మృతదేహం

నవాబుపేట: ఆకలిబాధ తాళలేక మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ మండలం ధర్మాపూర్‌కు చెందిన బైని నాగమ్మ (38) ఆశ కార్యకర్తగా పనిచేసేది. ఇటీవల ఆరోగ్యం సరిగాలేక మతిస్థిమితం కోల్పోయింది. మూడు రోజుల కిందట ఇంట్లో ఎవరికీ చెప్పకుండా నవాబ్‌పేటకు వచ్చింది. ఆమె కేవలం నీళ్లు మాత్రమే తాగి రోజులు గడిపేది. ఆకలి బాధతో కూర్చొన్న చోటే మృతి చెందిందని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతురాలి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి సోదరుడు యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

ఒకేచోట తిష్ట!

- కలెక్టరేట్ నుంచి కదలని పలువురు అధికారులు
- ఐదారేళ్లుగా ఒకేచోట విధినిర్వహణ
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్


మహబూబ్‌నగర్ కలెక్టరేట్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో పరిపాలనా అధికారులు చాలామంది మారారు. కానీ కొందరు అధికారులు మాత్రం కలెక్టరేట్‌ను వీడడం లేదు. కొన్నేళ్లుగా ఇక్కడే తిష్ట వేసుకొని కూర్చున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒకేచోట దీర్ఘకాలికంగా విధులు నిర్వహించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం మూడు సంవత్సరాలకు మించి ఒకే స్థానంలో పని చేయడానికి వీల్లేదు. ఐదారేళ్ల నుంచి ఉన్న చోటే విధులు నిర్వర్తిస్తున్నా స్థానచలనం కావడం లేదు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇటీవల మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని ప్రభుత్వం బదిలీ చేసింది. కలెక్టరేట్‌లో కొందరికి మాత్రం ఆ నిబంధనలు వర్తించలేదు. ఇందులో ఓ సెక్షన్ అధికారి అపాయిమెంట్ అయినప్పటి నుంచి ఒకే సెక్షన్‌లో విధులు నిర్వహిస్తూ పదోన్నతులు పొందినా.. బదిలీ కాకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ అధికారి కళ్లెదుట ఎంతోమంది కలెక్టర్లు మారారు. కానీ ఆ అధికారిని మాత్రం ఎవ్వరు కదిలించలేకపోతున్నారని ఉద్యోగులు అనుకుంటున్నారు. ఆగస్టు 19న ఆ అధికారి బదిలీకి జారీ చేసిన ఉత్తర్వుల్లో అదే సెక్షన్‌కు తిరిగి సూపరింటెండెంట్‌గా డిప్యూటేషన్‌పై కొనసాగేందుకు అవకాశం కల్పించారు. అంటే ఆ అధికారి పవరేమిటో అర్థం చేసుకోవచ్చు. కలెక్టరేట్‌లో మరో సెక్షన్‌లోని డిప్యూటీ తహసీల్దార్ 2017 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఎలక్షన్ బదిలీల్లో భాగంగా ఎంతో మంది బదిలీ అయినా.. ఈ అధికారిని మాత్రం బదిలీ చేయలేదు. వీరితోపాటు సివిల్ సప్లై శాఖకు చెందిన మరో సెక్షన్ అధికారి 6 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల్లో కొందరికి మినహాయింపులు ఉంటాయా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఏఓ శంకర్‌ను సాక్షి వివరణ కోరగా, ఎన్నికల నేపథ్యంలో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసిందని తెలిపారు.

జూరాలకు 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


రామన్‌పాడులో నీటిమట్టం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్‌కు మంగళవారం 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్ట్ నుంచి 3,695 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 119 క్యూసెక్కులు, బీమా లిఫ్ట్–1కు 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు, బీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.377 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు నీటి పంపింగ్ కొనసాగుతున్నట్లు చెప్పారు. గుడ్డెందొడ్డి లిఫ్ట్–1 వద్ద నీటి పంపింగ్‌ను నిలిపివేసినట్లు తెలిపారు.

శ్రీశైలంలో 854.7 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం 854.7 అడుగులకు నీటిమట్టం చేరింది. జలాశయంలో 90.9828 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 3వేలు, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 2,125, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 245, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయంలో 192 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

ఎన్టీఆర్ కాల్వకు 950 క్యూసెక్కులు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో 1,020 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల ఎడమ కాల్వ నుంచి 1,030 క్యూసెక్కులు, సమాంతర కాల్వ నుంచి 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వ ద్వారా ఆయకట్టుకు 950 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా కుడి కాల్వ నుంచి 10 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 10 క్యూసెక్కులు, బీమా ఫేజ్–2 నుంచి 851 క్యూసెక్కులతో పాటు తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.

కాల్వలోకి దూసుకెళ్లిన బొలెరో


ప్రమాదం నుంచి బయట పడిన కూలీలు

- కూలీలకు తప్పిన పెనుప్రమాదం

గట్టు: కర్నాటకలోని రాయచూర్ జిల్లా మిడిగిలిదిన్నెకు చెందిన 20మంది కూలీలు మంగళవారం తెల్లవారుజామున కూలీ పనుల నిమిత్తం బొలెరో వాహనంలో మల్దకల్‌కు బయల్దేరారు. వాహనం కిందిభాగం నుంచి ఏదో శబ్దం వస్తున్న విషయాన్ని గమనించిన డ్రైవర్ హనుమంతు.. మండల కేంద్రం సమీపంలోని తంగెలగడ్డ నెట్టెంపాడు కాల్వ వద్ద నిలిపాడు. డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న వృద్ధురాలు నర్సమ్మను బ్రేక్‌పై కాలు పెట్టమని చెప్పి, డ్రైవర్ కిందకు దిగాడు. అయితే వృద్ధురాలు బ్రేక్‌కు బదులు క్లచ్ నొక్కడంతో వాహనం ఒక్కసారిగా కాల్వలోకి దూసుకెళ్లింది. వాహనంలో ఉన్న కూలీలు హహాకారాలు చేశారు. కాల్వలో ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకొని ప్రాణాలను కాపాడుకున్నారు. ప్రమాదంలో కూలీలు స్వల్ప గాయాలతో బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను తెలుసుకున్నారు. కాల్వలోకి దూసుకెళ్లిన వాహనాన్ని జేసీబీ సహాయంతో ఒడ్డుకు చేర్చారు.


నెట్టెంపాడు కాల్వలోకి దూసుకెళ్లిన బొలెరో వాహనం

పాపం నర్సమ్మ..

డ్రైవర్ పక్కనే కూర్చున్న నర్సమ్మకు డోర్ తీయడం రాలేదు. డోర్ అద్దం తెరచి ఉండడంతో ఆ సందులోంచి ఈదుకుంటూ బయటకు వచ్చింది. అప్పటికే అక్కడే ఉన్న మరో మహిళ నర్సమ్మను ఒడ్డుకు లాక్కుపోయింది. ఒడ్డుకు చేరిన నర్సమ్మ భయంతో గజగజ వణికిపోయింది. నీటిలో పూర్తిగా తడిచిపోయిన కూలీలు దుస్తులను ఆరబెట్టుకుని, ఆ తర్వాత మరో వాహనంలో స్వగ్రామానికి వెళ్లిపోయారు.

ఆర్ఎంపీ దుర్మరణం


అజీజ్‌ఖాన్ (ఫైల్)

శాంతినగర్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ ఆర్ఎంపీ దుర్మరణం చెందిన ఘటన వడ్డేపల్లి మున్సిపాలిటీలోని గ్యాస్ గోదాం సమీపంలో చోటుచేసుకుంది. మానవపాడు మండలం పల్లెపాడులో ఆర్ఎంపీగా పనిచేస్తున్న అజీజ్‌ఖాన్ ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై శాంతినగర్‌కు వస్తుండగా, మార్గమధ్యంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆర్ఎంపీ, పీఎంపీలు గ్రామానికి చేరుకొని అజీజ్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

అడ్డాకుల: మూసాపేటలో రిటైర్డ్ మిలటరీ సోల్జర్ రేమద్దుల గంగపూరి (55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. నిజాలాపూర్‌కు చెందిన గంగపూరి ఆర్మీలో పనిచేసి రిటైర్ అయ్యారు. కొన్నేళ్ల కిందట మూసాపేటలో సొంత ఇల్లు కట్టుకుని నివాసముంటున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉండగా.. కూతురు విద్యుదాఘాతానికి గురై చనిపోయింది. ప్రస్తుతం ఆయన కుమారుడు విదేశాల్లో చదువుకుంటున్నాడు. కొన్నాళ్ల నుంచి భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. గంగపూరి మూసాపేటలోని సొంత ఇంట్లో ఒంటరిగా నివాసముంటున్నాడు. రెండు రోజుల నుంచి అతడు ఎవరికి కనిపించడంలేదు. దీంతో నిజాలాపూర్‌లో ఉండే బంధువులు మంగళవారం రాత్రి మూసాపేటకు వచ్చి ఇంటి తలుపులు తెరిచి చూడగా, మృతిచెంది కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతడి మృతికిగల కారణాలు తెలియరాలేదు. ఆత్మహత్య చేసుకున్నాడా...మరేదైనా జరిగిందా అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఈ ఘటనతో మూసాపేట, నిజాలాపూర్ గ్రామాల్లో విషాదం అలుముకుంది.

బైక్ ఢీకొని చిన్నారికి గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం : ద్విచక్ర వాహనం ఢీకొని చిన్నారికి తీవ్ర గాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ బస్టాప్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. హౌసింగ్‌బోర్డు కాలనీలోని గీతాంజలి పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న చిన్నారి సరిత పాఠశాల బస్సు దిగి ఇంటికి వెళుతుండగా, వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో చిన్నారికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు స్థానిక జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. ఘటనకు సంబంధించి ఎస్ఐ మహేందర్‌ను వివరణ కోరగా, ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


రామయ్యబౌలీలో గ్యారంటీ పథకాలను గురించి వివరిస్తున్న హమ్‌దుల్లా తదితర నాయకులు

- లక్షద్వీప్ పీసీసీ అధ్యక్షుడు హమ్‌దుల్లా సయీద్
- పాలమూరులో తిరగబడుదాం–తరిమికొడుదాం

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను తూచ తప్పకుండా అమలు చేస్తామని లక్షద్వీప్ పీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ మహ్మద్ హమ్‌దుల్లా సయీద్ అన్నారు. జిల్లాకేంద్రంలోని రామయ్యబౌలీలో సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో తిరగబడుదాం–తరిమికొడుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హమ్‌దుల్లా పార్టీ నేతలతో కలిసి వార్డులో పర్యటించి గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే కచ్చితంగా చేసి తీరుతుందన్నారు. కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్లు గుర్తుచేశారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని, ఆరు గ్యారంటీ పథకాలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామని ప్రకటించినట్లు తెలిపారు. గ్యారంటీ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ ప్రజల్లో మార్పు వచ్చిందని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని వర్గాలకు మేలు చేకూరేవిధంగా గ్యారంటీ పథకాలు అమలుచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీసెల్ అధ్యక్షులు అస్లాంబాషా, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, నాయకులు సీజే బెనహర్, చంద్రకుమార్‌గౌడ్, వసంత, బెక్కరి అనిత, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్‌అలీ, అవేజ్, ఫయాజ్, జహీర్, మల్లు నర్సింహారెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ గేమ్

గోపాల్‌పేట: ఆన్‌లైన్ గేమ్ (లూడో) ఓ విద్యార్థి ప్రాణం తీసింది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని ఏదుట్లకు చెందిన నాగమల్లయ్య, ఎల్లమ్మ కుమారుడు చిక్కొండ్ర నరేష్ (22 హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్ (లూడో) ఆడి సుమారు రూ.3లక్షలకుపైగా పోగొట్టుకున్నాడు. డబ్బులు కట్టాలని ఆన్‌లైన్ గేమ్ నిర్వాహకులు ఒత్తిడి చేయగా, సగం డబ్బులు చెల్లించాడు. ఇంకా డబ్బులు కట్టాలని ఒత్తిడి చేయడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఇటీవల గ్రామానికి వచ్చిన సురేష్.. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి తల్లిదండ్రులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉండగా, కూతుళ్ల పెళ్లిళ్లు చేశారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

మొసలి కలకలం



మాగనూర్: మండలంలోని కొల్పూర్ ఊరచెరువులో మొసలి సంచారం కలకలం సృష్టిస్తోంది. మంగళవారం చెరువుగట్టు మీదకు వచ్చి పందిని వేటాడుతున్న మొసలిని చూసి గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. నిత్యం మొసలి చెరువు నుంచి బయటకు వస్తుండటంతో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇస్తే ఒక బ్యానర్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారని వాపోతున్నారు. చెరువులో నీరు చాలా తక్కువగా ఉందని, మొసలిని బంధించి మరోచోటకు తరలించాలని గ్రామస్తులు కోరారు.

యువకుడి ఆత్మహత్య


బొగ్గు విష్ణు (ఫైల్)

మదనాపూరం: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ద్వారకనగరం సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ వివరాల మేరకు.. కొన్నూర్‌కు చెందిన బొగ్గు విష్ణు (31) కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి ద్వారక నగరంలోని సమీప బంధువు ఎర్రన్న ఇంటికి వెళ్లిన అతడు.. అర్ధరాత్రి సమయంలో సికింద్రాబాద్‌కు వెళ్తున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

జీవితంపై విరక్తితో గొంతు కోసుకున్న వృద్ధుడు

గోపాల్‌పేట: జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు గొంతు కోసుకున్న ఘటన మండలంలోని తిర్మలాపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. తిర్మలాపూర్‌కు లాలయ్యకు ఇద్దరు కూతుర్లు ఉండగా, పెళ్లిళ్లు చేశాడు. ప్రస్తుతం భార్యతో కలిసి ఉంటున్న అతడు ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో చాకుతో గొంతు కోసుకున్నాడు. కొంచం తెగిన తర్వాత భయాందోళనకు గురై అరిచాడు. భార్య, చుట్టుపక్కల వారు గమనించి అతడిని వెంటనే వనపర్తి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

యువకుడిపై దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలో ఓ యువకుడు మరో యువకుడిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన కౌశిక్ ఈనెల 17న వికాస్‌పై అకారణంగా దాడి చేశాడు. ఇదే విషయంపై సంజయ్‌నగర్ కాలనీకి చెందిన జాజుల రాజ్‌కుమార్.. తన దోస్తును ఎందుకు కొట్టారని కౌశిక్ సోదరుడు కార్తీక్‌కు ఫోన్‌చేసి ప్రశ్నించాడు. దీంతో కోపోద్రిక్తుడైన కార్తీక్ మంగళవారం ఎర్రగడ్డ కాలనీలోని గణేష్ మండపం వద్దకు వచ్చి రాజ్‌కుమార్‌పై రాళ్లతో దాడి చేశాడు. అంతటితో ఆగకుండా తన వెంట తెచ్చుకున్న కత్తితో బెదిరిస్తూ పొడిచేస్తా అంటూ కాలనీలో హంగామా చేశాడు. అక్కడున్న కొందరు ఫోన్‌లో వీడియో తీయడాన్ని గమనించి, అక్కడి నుంచి జారుకున్నాడు. తీవ్రగాయాలైన రాజ్‌కుమార్‌ను స్థానికులు జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. కాగా యువకుడిపై దాడికి పాల్పడిన కార్తీక్ ఇటీవలే బీఆర్ఎస్‌లో చేరాడు.

మృతదేహం లభ్యం

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ ఆస్పత్రి సమీపంలో గుర్తుతెలియని మహిళ (35) మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూం వెనుక భాగంలో ఉన్న ముళ్లపొదల్లో మంగళవారం మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మహిళ మృతి చెంది నాలుగు రోజులు అవుతుందని, మృతదేహం కుళ్లిపోయి గుర్తించలేని స్థితిలో ఉందని ఎస్ఐ తెలిపారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, శరీరంపై పంజాబీ డ్రస్ ఉన్నట్లు వెల్లడించారు. మున్సిపల్ జవాన్ సూర్య శ్యాంసుందర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మక్తల్: పట్టణంలో మంగళవారం రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం సేకరించి, వాహనంలో సమస్తాపూర్‌కు తరలిస్తుండగా, దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్ఐ పర్వతాలు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

శెభాష్.. రాము


100 కేజీల సందెపురాయిని ఎత్తిన రాము

కృష్ణా: మండలంలోని ముడుమాల్‌కు చెందిన ఉజ్జెల్లి రాము 100 కిలోల సందెపురాయిని ఎత్తి అందరినీ అబ్బురపరిచాడు. మంగళవారం గ్రామస్తుల సమక్షంలో ఒంటిచేత్తో సందెపురాయి ఎత్తి సత్తా చాటాడు. దీంతో గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, యువకులు రామును శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ఇప్పటివరకు ఒంటిచేత్తో వందకిలోల సందెపురాయి ఎత్తిన వారు లేరని, మొదటిసారిగా ఈ యువకుడు సాధించాడని సర్పంచ్ బూడిద వెంకటప్ప తెలిపారు. కార్యక్రమంలో వాకిటి భీమశంకర్, వెంకటేష్, తమ్మప్ప, నింగప్ప, మేకలి నర్సింహులు, గోపాల్, నర్సింహ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి


దస్తగిరి (ఫైల్)

ఉండవెల్లి: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని మారమునగాల–1 గ్రామంలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ కథనం మేరకు.. మారుమునగాల–1కు చెందిన బోయ దస్తగిరి (20) సోమవారం సాయంత్రం వ్యవసాయ పొలానికి వెళ్లి పత్తిపంటను పరిశీలిస్తూ.. విద్యుత్ స్తంభం స్టే వైర్‌కు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి మేనమామ మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. కొన్నేళ్లుగా దస్తగిరి అతడి మేనమామ మద్దిలేటి వద్ద ఉంటున్నాడు. యువకుడి మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందని పలువురు పేర్కొన్నారు.

భూత్పూర్ మండలంలో..

భూత్పూర్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఎల్కిచర్లలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. నంద్యాల జిల్లా పాణ్యం మండలం సంద్యాలకు చెందిన వెంకటరాముడు (49), అదే గ్రామానికి చెందిన మేస్త్రీ నాగార్జునతో కలిసి ఎల్కిచర్లలో పల్లె సుధాకర్‌రెడ్డి ఇంటి నిర్మాణంలో భాగంగా గ్రానైట్ బండలు వేసేందుకు వచ్చారు. పనులు చేస్తున్న క్రమంలో వెంకటరాముడు విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వింత గొర్రెపిల్ల జననం


రెండు తలల గొర్రెపిల్లను చూపుతున్న యజమాని

కృష్ణా: మండలంలోని ముడుమాల్‌లో మంగళవారం వింత గొర్రెపిల్ల జన్మించింది. ముద్దే హన్మంతుకు చెందిన గొర్రెల మందలోని ఓ గొర్రె రెండు తలలతో కూడిన పిల్లకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు గొర్రెపిల్లను ఆసక్తిగా తిలకించారు. గొర్రెపిల్ల పూర్తి ఆరోగ్యంగా ఉందని హన్మంతు తెలిపారు.